క్లుప్తంగా

ఉండిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరాలి


చినమిల్లిపాడులో ప్రచారం చేస్తున్న పీవీఎల్ సోదరుడు గోపాలకృష్ణంరాజు

ఆకివీడు: ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పీవీఎల్.నర్సింహరాజు సోదరుడు గోపాలకృష్ణంరాజు చెప్పారు. మండలంలోని చినమిల్లి పాడు గ్రామంలో శనివారం ఇంటింటి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓట్లు వేయాలని కోరారు. మీరు వేసే ప్రతీ ఓటు మీ భవిష్యత్‌కు బాట వేస్తుందన్నారు. కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అన్యెం కృష్ణ, సిద్ధాపురం సర్పంచ్, ఉపసర్పంచ్‌లు చిగురుపాటి చిట్టిబాబు, ఇందుకూరి నారాయణరాజు, వైఎస్సార్‌సీపీ గ్రామ అధ్యక్షులు ఇంటి ప్రేమానందం, సచివాలయ కన్వీనర్ పాత యేసోబురాజు, బూత్ కన్వీనర్ బలే నరేష్, సత్తా ఏసురత్నం, ఘంటశాల వెంకన్నబాబు, విప్పర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

11న వాండ్రంలో సువార్త సభ

ఉండి: మండలంలోని వాండ్రంలో ఉన్న సెయింట్ జాన్స్ లూథరన్ చర్చ్‌లో ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి వాండ్రం వారి ఆధ్వర్యంలో సువార్త సభను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కోనాల సుదర్శనం, మరియమ్మ తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ పేరిష్ పాస్టర్ రెవరెండ్ వి.నెహ్రూ సభను ప్రారంభిస్తారని, సిస్టర్ డాక్టర్ కె.అంజలి (హైదరాబాద్) వాక్యోపదేశం చేస్తారని తెలిపారు. ఈ సభకు ఆయా మండలాలకు చెందిన క్రైస్తవ విశ్వాసులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

కోడిపందేల స్థావరంపై దాడి

పాలకోడేరు: మండలంలోని పెన్నాడలో కోడి పందేల స్థావరాలపై పోలీసులు దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. పెన్నాడలో కోడిపందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై నాళం శ్రీనివాసరావు శనివారం తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో 11 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.5100, 9 కోడిపుంజులు, ఏడు బైకులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేశామన, సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై నాలం శ్రీనివాసరావు తెలిపారు.

వైఎస్సార్ సీపీ కంచుకోటగా 'ఉండి'


కార్యక్రమంలో మాట్లాడుతున్న పిల్లంగోళ్ల శ్రీ లక్ష్మి


వైఎస్సార్ సీపీ మండల ముఖ్య నాయకుల సమావేశంలో మేము సిద్ధం అంటున్న దృశ్యం

ఆకివీడు: ప్రజాపొత్తుతో ప్రతిపక్షంపై యుద్ధానికి సిద్ధమైన మనం విజయం వైపు దూసుకెళ్తున్నామని ఉండి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకురాలు పిల్లంగోళ్ల శ్రీ లక్ష్మి అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు ఎండీ మస్తాన్ వలీ విడిది హాలులో శనివారం పట్టణ ముఖ్య నాయకులు, ఇన్‌చార్జిలు, కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో పిల్లంగోళ్ల శ్రీ లక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ టీడీపీ నాయకుడికి ఉండి టిక్కెట్ ఇస్తామని ప్రకటించిన వెంటనే ఆయన వైఎస్సార్ సీపీ శ్రేణులు, సోషల్ మీడియాపై విరుచుకుపడటం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఎవరి సత్తా ఏమిటో తేల్చేది ప్రజలేనన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే ఎన్నికల్లో ప్రగల్భాలు, హెచ్చరికలు, దౌర్జన్యకర ప్రసంగాలు తగదన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు ఇలాంటి సంఘటనల్ని ఎదుర్కొనేందుకు వచ్చే ఎన్నికల్లో సమష్టిగా కృషి చేసి ప్రతిపక్షాన్ని చిత్తుగా ఓడించాలన్నారు. ప్రజా మద్దతుతో పోటీలో ఉన్న మనమే విజయం సాధిస్తామని శ్రీలక్ష్మి ధీమా వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు దిగాలు చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎన్ని కూటమిలు వచ్చినా, ఎంత మంది నాయకులు మారినా రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. ఉండి నియోకవర్గంలో పీవీఎల్ నర్సింహహరాజు ఎమ్మెల్యేగా గెలుపొందడం ఖాయమన్నారు. భీమవరం అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు మోటుపల్లి గంగాధరరావు మాట్లాడుతూ నెల రోజులూ ప్రతి నాయకుడూ సైనికుడిలా పనిచేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలు వైఎస్సార్‌సీపీ వైపే ఉన్నారని, ఓటు బ్యాంక్‌ను సద్వినియోగం చేసుకుందామని పిలుపునిచ్చారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి, అభ్యర్థి పీవీఎల్.నర్సింహరాజును అసెంబ్లీకి పంపే వరకూ మనం నిద్రపోవద్దన్నారు. ఉండి నియోజకవర్గాన్ని జగన్ మోహన్ రెడ్డికి బహుమతిగా ఇద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఎస్కే రసూల్ బీబీ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు అంబటి రమేష్, జేసీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జి.దనుంజయ్, పట్టణ, మండల జేసీఎస్ కన్వీనర్లు శిరపు శ్రీనివాస్, పుప్పాల పండు, టౌన్ బూత్‌కమిటీ కన్వీనర్ రుంకాని శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి జై భీమ్ షటిల్ టోర్నమెంట్

ఉండి: మండలంలోని ఎన్నార్పీ అగ్రహారం ఎస్సీ కాలనీకి చెందిన జైభీమ్ షటిల్ కోర్టు సభ్యుల ఆధ్వర్యంలో ఈ నెల 12,13 తేదీల్లో ఉండి, భీమవరం టౌన్ స్థాయిలో షటిల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ఎ.రాజేశ్‌ఖర్, ఎం.అనిల్, జి.అజిత్, హెడ్ కోచ్ నక్కా మరియదాసు తదితరులు తెలిపారు. శనివారం ఉండిలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఉయ్యూరు ఆర్డీఓ దాసి రాజు ఆర్థిక సహకారంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని రెండు రోజుల పాటు నిర్వహించే ఈ టోర్నమెంట్‌లో ప్రథమ బహుమతి రూ.2వేలు, షీల్డు, రెండో బహుమతి రూ.1500, షీల్డ్, మూడవ బహుమతి 1000, షీల్డ్, నాలుగో బహుమతి రూ.500,షీల్డ్ అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టోర్నమెంట్‌లో పాల్గొనాలని ఆసక్తి కలవారు 12వ తేదీ సాయంత్రం 6 గంటలలోపుగా రిజిస్ట్రేషన్ ఫీజు రూ.300 చెల్లించి తమ పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 99666 96734, 96664 48237 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

ప్రతి ఇంటికీ సంక్షేమం జగన్ ఘనతే


సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

భీమవరం అర్బన్: ప్రతి ఇంటికీ సంక్షేమం అందజేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 58 నెలల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో భీమవరం నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసుకున్నామన్నారు. మనమంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటే మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. జిల్లాలు ఏర్పడిన అనంతరం భీమవరం కేంద్రాన్ని సీఎం జగన్ ఇచ్చారని, ఇక్కడే కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయంతో పాటు జిల్లా కేంద్రాలు ఉండటంతో మన ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. ఫుట్‌పాత్ బ్రిడ్జి వద్ద మరో వంతెన మంజూరయ్యిందని అదికూడా త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగే విధంగా ప్రజా రంజక పాలన సాగిస్తున్నారని ఆయన చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై జనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు వెల్లువలా వస్తున్నారన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని, నరసాపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, నియోజకవర్గంలో తనకు అండగా ఉండి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహరావు, మండల అధ్యక్షుడు తిరుమాని ఏడుకొండలు, మండల జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, సర్పంచ్ బూరబత్తుల రామ్మూర్తి, ఉప సర్పంచ్ తిరుమల విజయరామ్, బద్ధా శాంతారామ్, పనసకర్ల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

పాలకోడేరు: ఎన్నికలు ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు అని, అలాంటి ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలంతా సహకరించాలని పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు కోరారు. శనివారం శృంగవృక్షంలో ఏర్పాటు చేసిన ఎన్నికల అవగాహనా సదస్సు లో మాట్లాడారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఎన్నికల కమిషన్ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ జారీ చేసిందని, వాటిని అవగాహన చేసుకుని అందరూ పాటించాలని కోరారు. తెలిసీ తెలియక తప్పులు చేస్తే అనవసరంగా కేసుల్లో ఇరుకుంటారని స్పష్టం చేశారు.

చురుగ్గా పంటబోదెల తవ్వకం

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. మొగల్తూరు పంచాయతీలోని పాలకమ్మచెరువు, నక్కావారిపాలెం, ఇంజేటివారిపాలెం, కెపిపాలెం,పేరుపాలెం, కాళీపట్నం గ్రామాల్లో పంటబోదె పనుల తవ్వకం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. శనివారం కాళీపట్నం తూర్పులో పంట బోదె తవ్వకం పనులను జేఈ ఆనంద్ పరిశీలించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం పట్టణంలోని డి1 విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు పట్టణంలో పలు చోట్ల విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్ అహ్మద్‌ఖాన్ శనివారం తెలిపారు . కలెక్టరేట్ ఏరియా, బొక్కవారిపాలెం, మల్లె తోట, చిన్నరంగనిపాలెం, హౌసింగ్ బోర్డ్ ఏరియా , పీపీ రోడ్, ఇండస్ట్రియల్ ఏరియా, నరసయ్య అగ్రహారం, పార్క్ స్ట్రీట్ ఏరియా, వేండ్ర కెనాల్ రోడ్, రామచంద్రపురం, కోడవల్లి రోడ్డు, సబ్ రిజిస్టర్ ఆఫీస్, మారుతీ నగర్, ప్రకృతి ఆశ్రమం, సంజన అపార్ట్‌మెంట్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని అహ్మద్‌ఖాన్ కోరారు.

ప్రసాదరాజుపై బాబు వ్యాఖ్యలు అర్థరహితం

నరసాపురం: నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజుపై టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు చేసిన విమర్శలు అర్థరహితంగా ఉన్నాయని వైఎస్సార్ సీపీ నేత, రిజైర్డ్ మున్సిపల్ శానిటరీ ఇన్స్‌పెక్టర్ తిర్రే బాబూరావు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్టీమర్‌రోడ్డులో జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యే ముదునూరి ఏటిగట్టు పనుల్లో అవినీతి చేశారని ఆరోపించడంలో అర్థం లేదన్నారు. ముదునూరిపై చిన్న అవినీతి మరక కూడా లేదన్నారు. గతంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా నియోజకవర్గాన్ని ముదునూరి అభివృద్ధి చేశారన్నారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వశిష్టవంతెన, బియ్యపుతిప్ప ఫిషింగ్‌హార్బర్, ఫిషరీష్ యూనివర్సిటీ లాంటి ప్రాజెక్ట్‌ల కలలను ముదునూరి నిజం చేశారన్నారు.

నిబద్ధతతో ఓటు హక్కును వినియోగించుకోవాలి


భీమవరంలో ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రజాస్వామ్య ఔన్నత్యాన్ని కాపాడే వజ్రాయుధం ఓటు హక్కు అని జిల్లా స్వీప్ నోడల్ అధికారి జీసీహెచ్ ప్రభాకర్ అన్నారు. శనివారం భీమవరంలో జిల్లా పౌర సరఫరాల శాఖ, భీమవరం బార్ సోషల్, ఆదిత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కార్యక్రమం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజలంతా నిబద్ధతతో ఎలాంటి ప్రలోభాలకు లోనుగాకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు నమోదు చేసుకోవడానికి ఈనెల 14వ తేది వరకు అవకాశముందన్నారు. 85ఏళ్లు నిండిన వృద్ధులకు, అలాగే వికలాంగులకు ఇంటివద్దనే ఓటు వేసుకునే సౌకర్యం ఎలక్షన్ కమిషన్ కల్పించిందన్నారు. అనంతరం కోర్టు ప్రాంగణం నుంచి జువ్వల పాలెం రోడ్డు వరకు ఓటుకు నోటు వద్దే వద్దు వంటు నినాదాలు చేస్తూ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీవీల్ సప్లయి జిల్లా మేనేజరు టి శివరామప్రసాద్, డీఎస్‌వో ఎస్ సరోజ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంవీ రమణారావు, ఎంపీడీఓ వెంకటరామన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలి


భీమవరం ఎస్ఆర్‌కేఆర్‌లో ట్రిబుల్ ఈఈ క్రానికల్‌ను విడుదల చేస్తున్న విజయరామరాజు

భీమవరం: విద్యార్థులందరూ పరిశోధనలపై దృష్టి సారించాలని హైదరాబాద్‌లోని గోకరాజు రంగరాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగం హెడ్ వి విజయరామరాజు అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పూర్వ విద్యార్థులతో రెండు రోజులు నిర్వహించే అపూర్వ 24 వర్క్ షాప్ శనివారం ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సాంకేతిక విద్యలో విద్యార్థికి మెలుకువలు నేర్పడంగాని సంబంధిత సబ్జెక్టులో విద్యార్థి ఆలోచనలకు మరింత నైపుణ్యం అందించేందుకు గురువు ప్రాధాన్యత ఎంతో ఉందన్నారు. విద్యార్థులు ప్రాజెక్టులు చేపట్టినపుడు వాటిపై విద్యార్థి అనుమానాలు గురువు మాత్రమే నివృత్తి చేయగలరని ఆయన స్పష్టం చేశారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవి మురళీ కృష్ణంరాజు మాట్లాడుతూ సాంకేతిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థులు మరింత నైపుణ్యం సంపాదించుకొని పరిశోధనల వైపు కూడా దృష్టి సారించాలని కోరారు. అనంతరం విద్యార్థులు రూపొందించిన ట్రిబుల్ ఈఈ క్రానికల్‌ను విజయరామరాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు, ట్రిబుల్ ఈఈ విభాగం హెడ్ బిఆర్‌కే వర్మ, ఎస్ శ్రీనివాస్, అలుమిని కోఆర్డినేటర్ ఎం అనిల్, జి హరీష్ కుమార్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు వారతిప్పలో ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచారం

మొగల్తూరు: మండలంలోని వారతిప్ప గ్రామంలో ఆదివారం ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కర్రి ఏసుబాబు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సిద్ధాంతంలో ఆకట్టుకున్న చిర్రావూరి ప్రవచనాలు


సిద్ధాంతంలో ప్రవచనకర్త చిర్రావూరికి స్వాగతం పలుకుతున్న భక్తులు

పెనుగొండ: మండలంలోని సిద్ధాంతం పవిత్ర వశిష్ఠగోదావరి తీరం శనివారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. హిందూధర్మం ఛానల్‌లో ప్రముఖ ప్రవచనకర్త చిర్రావూరి గురువు శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులకు ప్రవచనాలు వినిపించి ఆశీర్వచనాలు అందజేశారు. గ్రామానికి విచ్చేసిన చిర్రావూరి వారిని భక్తులు సన్నాయి మేళతాళాలతో స్వాగతం పలికారు. ఆయన గ్రామంలోని దేవాలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం గోదావరి తీరంలో అఖండ ద్వీపప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో వంగూరి భాస్కర్, తురగా చంద్రశేఖర్, కసుగుర్తి వెంకటరమణ, బొక్కా సత్యం, మానేపల్లి వెంకటకృష్ణ, యక్కల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పులను బీఎల్‌ఓలు పంపిణీ చేయాలి



బీఎల్ఓల సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి వి.స్వామినాయుడు

పెనుమంట్ర: ప్రతి గ్రామంలో ఓటర్లకు స్లిప్పులను బీఎల్‌ఓలు పంపిణీ చేయాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల అధికారి వి.స్వామినాయుడు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సూపర్‌వైజర్లు , బూత్ లెవల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులంతా ఈనెల 14లోపుగా తమ ఓటు హక్కు కోసం ఫారం 6 ను దరఖాస్తు చేసుకోవాలని. 85 ఏళ్లు దాటిన వృద్ధులు, అధిక శాతం అంగవైకల్యం ఉన్న విగలాంగులకు ఇంటి వద్ద ఓటు వేసే సదుపాయాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని, దానికి ఫారం 12–డి దరఖాస్తు చేయించి, వారు ఇంటి వద్ద నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునే విధంగా బీఎల్‌ఓలు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కోట లక్ష్మీకల్యాణి, ఎంపీడీఓ పద్మజ, సెక్టార్ అధికారులు నాగిరెడ్డి, సూర్యనారాయణరాజు, ఎలియమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవ వేంకటేశ్వరునిగా వేములదీవి వెంకన్న

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని ప్రత్యేకంగా వైభవ వేంకటేశ్వర స్వామిగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. అలాగే మధ్యాహ్నం స్వామి వారి ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.

మేజిస్ట్రేట్ అజయ్‌కుమార్‌కు సత్కారం


నక్కా అజయ్‌కుమార్ దంపతులను సత్కరిస్తున్న మిత్రులు

పోడూరు: నిడదవోలు రెండో అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ నక్కా అజయ్‌కుమార్ దంపతులను శనివారం పెనుగొండ మండలం సిద్ధాంతం గ్రామంలో ఆయన చిన్ననాటి మిత్రులు ఘనంగా సత్కరించారు. తణుకులో లాయర్‌గా విధులు నిర్వహిస్తున్న అజయ్‌కుమార్ గత నెల 7న మేజిస్ట్రేట్‌గా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా సిద్ధాంతం హైస్కూల్‌లో ఆయనతో కలసి చదువుకున్న చిన్ననాటి మిత్రులంతా అజయ్‌కుమార్, కమలరత్నం దంపతులను దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ చిన్నతనంలో తనతో చదువుకున్న మిత్రుల చేతులమీదుగా సత్కారం అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో వెంకట నర్సింహమూర్తి, ర్యాలి శంకరం, గుల్లిపల్లి గంగరాజు పాల్గొన్నారు.